సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 7 । ఆగస్టు । 2025



సాంకేతిక పథం..!

ఉపాధి హామీ పథకంలో హాజరు నమోదుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త ఆలోచనతో ముందుకొచ్చింది. కొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

- 8లో



ఆత్మీయతకు రాఖీ

రాఖీ పండగ సందర్భంగా మార్కెట్‌లో వినూత్న రాఖీలు దర్శనమిస్తున్నాయి. కొందరు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారు.

- 8లో

వేడుకల ముందు పరీక్షలా?

శ్రీకాకుళం: విద్యార్థులు ఎంతో సరదాగా జరుపుకొనే స్వాతంత్ర్య వేడుకలకు నాలుగు రోజుల ముందు ఫార్మేటివ్ పరీక్షలు నిర్వహించడం సమంజసం కాదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు అన్నారు. ఆనవాయితీగా వస్తున్న ఆటలు ఆడించలేక, అటు పరీక్షలకు సన్నద్ధం చేయలేక ఉపాధ్యాయులు సతమతమవుతున్నారని చెప్పారు. విద్యాశాఖ అధికారులు పునరాలోచన చేయాలని కోరారు.

న్యూస్‌రీల్

టీడీపీ అరాచక దాడులు దారుణం



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: పులివెందులలో జెడ్పీటీసీ ఎన్నిక సందర్భంగా టీడీపీ గూండాలు దాడులకు దిగి బీసీ నేత, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను గాయపరచడం శోచనీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అరాచక దాడులు చూస్తుంటే అసలు ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. లేదా అనే సందేహం కలుగుతోందని, ఇంకెన్నాళ్లీ రెడ్‌బుక్ పాలన సాగిస్తారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనం పాటించినప్పటికీ టీడీపీ కార్యకర్తలు మారణాయుధాలతో వచ్చి దాడులకు దిగారని దుయ్యబట్టారు. ఇంత జరుగుతున్నా ఎన్నికల సంఘం ప్రేక్షక పాత్ర వహించడం సరికాదన్నారు. ఎమ్మెల్సీపై జరిగిన దాడిపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగం ఏపీ రాష్ట్ర పరువు తీస్తుందని, ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తుందని ఆందోళన చెందారు. ఈ దాడులను ప్రతీ ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు.

నీలమణి దుర్గ హుండీ ఆదాయం రూ.6.29 లక్షలు



హుండీ కానుకల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

పాతపట్నం : ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారి హుండీ కానుకల ద్వారా రూ.6,29,838 లక్షలు ఆదాయం లభించిందని ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. 55 రోజులకు గాను ఆలయ హుండీని బుధవారం తెరిచి లెక్కించామని చెప్పారు. టెక్కలి గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి టి.పి.మనస్విని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ గుమస్తా సుదర్శన్, వేంకటేశ్వర స్వామి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మూలపేట పోర్టు పునరావాస కమిటీ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మూలపేట పోర్టు నిర్మాణానికి సంబంధించి పునరావాస అంశాలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమీక్ష బుధవారం జరిగింది. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో టెక్కలి ఆర్డీఓ, ఇతర శాఖల అధికారులు పాల్గొని పునరావాస గ్రామాల నిర్మాణం, స్థలాల కేటాయింపు, మౌలిక వసతులు, గృహ నిర్మాణాలు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై చర్చించారు. తాగునీటి సరఫరా, రహదారి అనుసంధానం, పునరావాస ప్రక్రియ, విశేష గ్రామాల పరిధిలోని ఖాళీ స్థలాల వినియోగం, పోర్టు రహదారికి సంబంధించిన న్యాయపరమైన అంశాలు, రైల్వే మార్గంలో చేయాల్సిన సాంకేతిక మార్పులపై సమీక్షించారు. ఇతర శాఖల సమన్వయంతో జరుగుతున్న పనుల వివరాలను అధికారులు కమిటీకి సమర్పించారు. సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి కిరణ్‌కుమార్, పంచాయతీరాజ్, నీటి పారుదల, రోడ్లు–భవనాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

12న మెగా జాబ్ మేళా



శ్రీకాకుళం పాతబస్టాండ్/నరసన్నపేట: నరసన్నపేటలోని పద్మావతి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 12న మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, టీం లీజ్, డక్కన్ టీవీ, తోషిబా తదితర 11 కంపెనీలకు చెందిన ప్రతినిధులు మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారు విజయనగరం, విశాఖ, హైదరాబాద్, శ్రీసిటీల్లో పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు 9949900672, 6301046329 నంబర్లను సంప్రదించవచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ పేర్కొన్నారు.

విషాద తీరం!

- భావనపాడు తీరానికి చేరిన మూడు మృతదేహాలు
- శోకసంద్రంలో బాధిత కుటుంబాలు



మృతదేహాలను బోటులో ఒడ్డుకు చేర్చుతున్న మెరైన్ పోలీసులు, మత్స్యకారులు

సంతబొమ్మాళి: భావనపాడు సముద్రతీరంలో మంగళవారం సాయంత్రం గల్లంతైన ముగ్గురు పాలిటెక్నికల్ విద్యార్థులు దున్న దుర్యోధన, తిమ్మల జశ్వంత్, రాయల రాజేష్ విగతజీవులుగా మారారు. వీరి మృతదేహాలు బుధవారం తీరానికి చేరాయి. మెరైన్ సీఐ రాము ఆధ్వర్యంలో మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులు రెండు బృందాలుగా విడిపోయి రాత్రంతా సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం అర్ధరాత్రి సుమారు 12 గంటలకు జశ్వంత్ మృతదేహం భావనపాడు తీరానికి చేరింది. ఆ తర్వాత గంటన్నర వ్యవధిలో రాత్రి 1.30 గంటలకు రాజేష్ మృతదేహం అదే తీరానికి చేరుకుంది. మిగిలిన దుర్యోధన మృతదేహం బుధవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు భావనపాడు తీరానికి కొట్టుకొచ్చింది. మృతదేహాలకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుమారుల మృతదేహాలను చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.



రాజేష్, దుర్యోధన, జశ్వంత్‌ల మృతదేహాలు

కృష్ణ.. కృష్ణా..!



కన్నీటి వెతలు



ఈ చిత్రంలోని వృద్ధ దంపతులు కాయల అసిరయ్య, బంగారమ్మ. వీరి కుమారుడు కాయల శ్రీను 35 ఏళ్లకే కిడ్నీ వ్యాధితో మరణించాడు. అతని భార్య జయలక్ష్మి, పాప శ్వేతశ్రీ, బాబు యష్మిత్ ఉన్నారు. శ్రీను పాలకేంద్రం నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయన మరణాంతరం అతని భార్యపై కుటుంబ భారం పడింది.



ఈ చిత్రంలోని మహిళ పేరు నక్కెర్ల లక్ష్మి. ఈమె భర్త సింహాచలం 52 ఏళ్లకే కిడ్నీ వ్యాధి బారిన పడి మరణించాడు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. ఇంటి పెద్ద దిక్కు దూరం కావడంతో లక్ష్మి కూలి పనికి వెళ్తోంది. భర్త వైద్యానికి, కుమార్తె పెళ్లికి చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక సతమతమవుతోంది.




కృష్ణాపురంలో మంచానికే పరిమితమైన కిడ్నీ బాధితురాలు గార వెంకటమ్మ

- మరో ఉద్దానంగా మారుతున్న కృష్ణాపురం
- కిడ్నీ వ్యాధులతో 19కు చేరిన మరణాలు
- మహమ్మారితో పోరాడుతున్న మరో 22 మంది
- బిక్కుబిక్కుమంటున్న గ్రామస్తులు

పొందూరు :

ఆ గ్రామంలోని ప్రజలంతా రెక్కాడితే గానీ డొక్కాడని పేదలే. అందరూ క్వారీలు, వ్యవసాయ పొలాల్లో కూలీలుగా పనిచేసేవారే. ఇప్పుడా గ్రామస్తులను కిడ్నీ మహమ్మారి పట్టిపీడిస్తోంది. ఇప్పటికే 19 మంది కిడ్నీ సమస్యలతో మృత్యువాత పడగా.. మరో 22 మంది మహమ్మారితో పోరాడుతూ చికిత్స పొందుతున్నారు. ఆ గ్రామమే పొందూరు మండలంలోని కృష్ణాపురం. కిడ్నీ సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ఉద్దానం ప్రాంతం తరహాలో ఇక్కడ కూడా ఏ కుటుంబాన్ని కదిల్చినా విషాద గాథలే.

కిడ్నీ మృతులు వీరే..



గ్రామంలో ఇప్పటి వరకు 19 మంది కిడ్నీవ్యాధుల బారిన పడి మరణించారు. వీరిలో కాయల శ్రీను, గొర్లె సరస్వతి, బలగ రాములు, కెల్ల అక్కలనాయుడు, కెల్ల రమణ, అచ్యుతరావు, పోలాకి పైడితల్లి, నక్కెర్ల అమ్మన్న, సింహాచలం, గార అప్పమ్మ, సూర్యనారాయణ, గంట్యాడ లక్ష్మం, సారి అనంతరావు, బలగ పార్వతి, పట్నా అప్పలసూరమ్మ, మంగి పైడినాయుడు తదితరులు ఉన్నారు.

అంతుచిక్కని వేదన..

కృష్ణాపురంలో తాగునీటి వనరులు బాగానే ఉన్నాయి. గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు రక్షిత మంచినీటి పథకం, బోర్లు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి నీటి వనరుల్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి స్వచ్ఛతా పరీక్షలు నిర్వహిస్తున్నారు. రిపోర్టుల్లో ఎటువంటి లోపాలు కనిపించటం లేదు. అయినా కిడ్నీ వ్యాధి బారిన ఎందుకు పడుతున్నారో తెలియక గ్రామస్తులు సతమతమవుతున్నారు. గత నెల 25న శ్రీకాకుళం ల్యాబ్‌లో నీటి స్వచ్ఛత పరీక్షలను ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది చేయించగా ఎటువంటి లోపం లేదని రిపోర్టులు వచ్చాయి. అయినప్పటికీ ఫ్లోరైడ్, పీహెచ్, క్షారగుణం, సంపూర్ణ కఠినత్వం, క్లోరైడ్, నైట్రేట్, ఐరెన్, ఫ్రీక్లోరిన్ వంటి పరీక్షలను స్థానిక సచివాలయం సిబ్బంది మంగళవారం చేయించారు. వీటిని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎంవీకే నాయుడు పర్యవేక్షిస్తున్నారు. ఈసారి వచ్చే ఫలితాలతోనైనా స్పష్టత వస్తే అందుకు అనుగుణమైన చర్యలు చేపడతామని అధికారులు చెబుతున్నారు.

చికిత్స పొందుతున్నవారు..

గ్రామంలో 22 మంది కిడ్నీ వ్యాధికి చికిత్స పొందుతున్నారు. గార వెంకటమ్మ, లక్ష్మణరావు, కాయల రమణ, చిత్తిరి సూర్యనారాయణ, పిసిని రామారావు, గంట్యాడ సరస్వతి, సువ్వాడ అప్పలనారాయణ, కాయపైడియ్య, గార రామ్మూర్తి, రమణ, లగడంపూడి చిన్నమ్మడు, గార వరలక్ష్మి, కోన రాజారావు తదితరులు చికిత్స పొందుతున్నారు.



శ్రీకాకుళంలో డయాలసిస్ చేయించుకుంటున్న లక్ష్మణరావు

ఏ పనీ చేయలేకపోతున్నా..

నాలుగేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాను. వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నాను. ఏ పనీ చేయలేకపోతున్నాను. నాకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నా భార్య కూలి పనికి వెళ్లి మమ్మల్ని పోషిస్తోంది.

– జి.లక్ష్మణరావు, కిడ్నీ బాధితుడు, కృష్ణాపురం

నెలకు రూ.15 వేలు ఖర్చు...

ఆరేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాను. రెండేళ్లుగా డయాలసిస్ చేయించుకుంటున్నాను. నెలకు రూ. 15వేల వరకు ఖర్చు అవుతుంది. నా భర్త కూలి పని చేస్తున్నారు. వైద్య ఖర్చులకు పొలం అమ్మాల్సి వచ్చింది.

– గార వెంకటమ్మ, కిడ్నీ బాధితురాలు, కృష్ణాపురం

పరీక్షలు చేయిస్తున్నాం..



గ్రామంలో నీటి స్వచ్ఛతా పరీక్షలు మంగళవారం ప్రారంభించాం. సచివాలయంలో 8 రకాల పరీక్షలు చేయిస్తున్నాం. గత నెల 25న పరీక్షలు చేయించగా ఎటువంటి లోపం లేనట్లు రిపోర్టులు వచ్చాయి. ల్యాబ్‌లో మరోసారి పరీక్షలు చేయిస్తాం.

– ఎంవీకే నాయుడు, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్

శిబిరం ఏర్పాటు చేస్తాం..



గ్రామంలో కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధి ఉన్నట్లు తెలిసింది. నీటి పరీక్షలు, వైద్య పరీక్షలు చేయిస్తాం. గురువారం నుంచి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తాం.

– డాక్టర్ నవీన్, వైద్యాధికారి, తాడివలస పీహెచ్‌సీ

కానరాని నీరు.. రైతు కంట కన్నీరు!



పెద్దపాలెం సమీపంలో ఎండిపోతున్న వరిపొలం

సరుబుజ్జిలి: సాగునీరు అందక వ్యవసాయ పొలాలు బీడు భూములుగా మారుతున్నాయి. సరుబుజ్జిలి మండలం పెద్దపాలెం, చిన్నపాలెం గ్రామాల మధ్య మొక్కల బంధ ఆయకట్టు పరిధిలో సుమారు 60 ఎకరాల పంటభూమి నీరులేక కళ్లముందే ఎండిపోతుండటంతో రైతులు విలవిల్లాడుతున్నారు. సాగునీటి కోసం అధికారులు ముందస్తు ప్రణాళికలు చేపట్టకపోవడం వల్ల వరినారు ఎదిగే దశలో మాడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పిల్లకాలువల ద్వారా చుక్కనీటిని కూడా చెరువుకు విడిచిపెట్టలేదని వాపోయారు. ఈ ప్రాంతంలో అధికశాతం మంది కౌలురైతులే. అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నామని, ఈ విధంగా పంట పాడైపోతే తమ పరిస్థితి ఏంటని లబోదిబోమంటున్నారు.

గుర్రపుడెక్క ఇలా.. సాగునీరు ఎలా?



నరసన్నపేట మండల పరిధిలో సాగునీటి కాలువులో గుర్రపు డెక్కతో నిండిపోయాయి. ఓ వైపు ఉభాలు పనుల్లో రైతులు బిజీగా ఉంటే మరోవైపు గుర్రపు డెక్క తొలగింపు పనులు మాత్రం తూతూమంత్రంగా జరుగుతున్నాయి. దీంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కిల్లాం వద్ద పోలాకి ఓపెన్ హెడ్ చానల్ నిండా గుర్రపు డెక్కను ఈ చిత్రంలో చూడొచ్చు.

– నరసన్నపేట



నరకయాతన

జి.సిగడాం మండలం టంకాల దిగ్గువలస నుంచి నక్కపేట వెళ్లే రహదారి రాళ్లు తేలడంతో వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఐదునెలల కిందట రహదారి మరమ్మతులు పేరిట తవ్వేసి ఇంతవరకు తారు వేయకపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

– జి.సిగడాం

శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్.. మాస్టర్‌ప్లాన్‌కు ఆమోదం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలో 53.17 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ మాస్టర్‌ప్లాన్‌కు ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ డెవలప్‌మెంట్స్ (లే అవుట్, సబ్ డివిజన్) నియమాల ప్రకారం పలు సవరణల ద్వారా మాస్టర్‌ప్లాన్ ఆమోదించినట్లు పేర్కొన్నారు. గెజిట్ నోటిఫికేషన్ ప్రచురితమైన ఆరు నెలల పాటు శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్, సుడా, పంచాయతీల కార్యాలయాల్లో మాస్టర్‌ప్లాన్ కాపీని ప్రజలకు అందుబాటులో ఉంచాలని సుడా వైస్‌చైర్మన్‌ను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలోనే మాస్టర్‌ప్లాన్‌కు ప్రజాప్రతినిధులు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారులు చర్చించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయడంతో ప్రస్తుత ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

మేటల మాటున.. ఇసుక ముఠా!



యంత్రాలతో ఇసుకను తోడేస్తున్న దృశ్యం

- 'గొట్టా'కు కూతవేటు దూరంలో ఇసుక అక్రమ తవ్వకాలు
- వందలాది వాహనాలతో ఇష్టారాజ్యంగా రవాణా
- హరిత ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు
- బట్టబయలు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

హిరమండలం:

పాతపట్నం నియోజకవర్గంలో ఇసుక దోపిడీ అడ్డగోలుగా సాగుతోంది. ఇటు వంశధార, అటు మహేంద్రతనయా నదులు ఇసుకాసురులకు కాసులు కురిపిస్తున్నాయి. ముఖ్యంగా కొత్తూరు, హిరమండలం, ఎల్‌ఎన్‌పేట మండలాల్లో ప్రవహిస్తున్న వంశధార నది అధికార పార్టీ నేతల పాలిట వరంలా మారింది. తాజాగా గొట్టా బ్యారేజీకి కూతవేటు దూరంలో రోజూ వందల వాహనాల్లో ఇసుక తరలించుకుపోతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. దీని వెనుక నియోజకవర్గ కీలక నేత హస్తం ఉన్నట్టు ఆరోపణలున్నాయి. మాజీ ఎమ్మెల్యే , వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి, ఇతర నాయకులు అక్కడ జరుగుతున్న ఇసుక దందాను తాజాగా బయటపెట్టడం జిల్లా మొత్తం సంచలనంగా మారింది.

అనుమతులపై సందేహాలు..

హిరమండలం మండలంలోని భగీరథపురం సమీపంలో వంశధార నదీ తీరంలో ఇసుక తవ్వకాలకు సియాన్ గ్రూపునకు అనుమతిచ్చారు. దీనికి సంబంధించి భగీరథపురం వద్ద ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటుచేయాలి. అయితే ఇక్కడ అనుమతుల విషయంలో పలు సందేహాలు ఉన్నాయి. వాస్తవానికి ఇక్కడి ఇసుక రీచ్ గొట్టా బ్యారేజీకి 3 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇది నిబంధనలకు విరుద్ధం కూడా. ఇలా తవ్వకాలు చేపడితే బ్యారేజీకే ప్రమాదం. మరోవైపు ఇసుక మేటలు వేశాయని కారణం చూపి ఇక్కడ తవ్వకాలు చేపడుతున్నారు. కానీ, ఇందుకు నిర్దిష్టమైన స్థలం పేరు ఉత్తర్వుల్లో రాయలేదు. అలాగని అక్కడ నదిలో ఎటువంటి ఇసుక మేటలు లేవు. గొట్టా బ్యారేజీ నుంచి వచ్చే నీటి ప్రవాహం నేరుగా భగీరథపురం, మహాలక్ష్మిపురం పిండ్రువాడ, అంబావల్లి, రెల్లివలస, అక్కరాపల్లి వైపు గట్టు కోతకు గురవుతోంది.



వంశధార పిల్ల కాలువపై గ్రావెల్ వేసి రహదారి ఏర్పాటు చేసిన దృశ్యం

ఎవరి ప్రయోజనాల కోసం?



ఇసుక మేటలు వేసిందని చెప్పి అనుమతులు ఇస్తారా? అసలు నదిలో ఎక్కడ ఇసుక మేటలు వేసింది. ఇసుక మేటలు వేస్తే ఏటా మా పొలాలపై వరద ఎందుకు ముంచుకొస్తుంది? గొట్టా బ్యారేజీకి ప్రమాదంగా భావిస్తున్న ఈ రీచ్‌కు అనుమతులు ఇవ్వడం ఎవరికి ప్రయోజనం? – మీసాల భాస్కరరావు, రైతు, భగీరథపురం

ఏటా ఆ గ్రామాల్లో పొలాల్లో వరద నీరు చేరుతోంది. అటువంటిది ఎలా అనుమతిచ్చారన్నది ప్రశ్నార్థకంగా మారింది. భగీరథపురం పేరిట అనుమతులు ఇస్తే మహాలక్ష్మిపురం వద్ద రీచ్ ఏర్పాటు చేసి తవ్వకాలు చేపడుతున్నారు.

పిల్ల కాలువను కప్పేసి..

ప్రస్తుతం జిల్లాను సస్యశ్యామలం చేస్తోంది గొట్టా బ్యారేజీ. అటువంటి బ్యారేజీ ఉనికిని ప్రశ్నార్థకం చేసేలా ఇక్కడ ఇసుక తవ్వకాలు చేపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వాస్తవానికి జూన్ నుంచి అక్టోబరు వరకూ వర్షాల సమయం. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం నదుల్లో ఇసుక తవ్వకాలు చేపట్టకూడదు. పైగా వంశధార ఎడమ కాలువకు సంబంధించి 4ఆర్ పిల్ల కాలువను కప్పేశారు. చిన్నపాటి పైపువేసి గ్రావెల్‌తో నింపేశారు. రహదారిగా మార్చేసి ఇక్కడ నుంచి ఇసుక తరలించుకుపోతున్నారు. కనీసం ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్, గ్రామస్తులకు తెలియజేయకుండా రీచ్ ఏర్పాటుచేసి అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. ఈ రీచ్‌కు సంబంధించిన అనుమతి పత్రాలు ఎవరడిగినా చూపించడం లేదు. కనీసం తహసీల్దార్ వద్ద కూడా ఏజెన్సీ అగ్రిమెంట్ తప్ప అనుమతి పత్రాలు లేకపోవడం కొసమెరుపు.

ఇసుక తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఆకాశమే హద్దుగా ఇసుక దోపిడీ

- పాతపట్నం ఎమ్మెల్యే కనుసన్నల్లోనే అక్రమాలు
- ఇసుక రీచ్ పరిశీలనలో వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి

హిరమండలం: పాతపట్నం నియోజకవర్గంలో ఆకాశమే హద్దుగా ఇసుక దోపిడీ జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి ఆరోపించారు. బుధవారం మహాలక్ష్మీపురం వద్ద ఏర్పాటుచేసిన ఇసుక రీచ్‌ను రైతులతో కలిసి సందర్శించారు. రోజూ వందలాది వాహనాల్లో ఇసుక తరలిపోతుండడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇసుక తరలింపు కోసం వంశధార ఎడమ ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న 4ఆర్ పిల్ల కాలువను గ్రావెల్‌తో కప్పేసి ఉండడాన్ని పరిశీలించారు. అక్కడ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక ర్యాంపు నిర్వహిస్తుండడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రెడ్డి శాంతి మీడియాతో మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గంలో ఇసుక దోపిడీ వెనుక స్థానిక ఎమ్మెల్యే హస్తం ఉందని ఆరోపించారు. ఆయన కనుసన్నల్లోనే మొత్తం వ్యవహారం నడుస్తోందన్నారు. ఇసుక మేటలు పేరుతో అనుమతులు ఇవ్వడంపై అనేక సందేహాలు ఉన్నాయన్నారు. అనుమతుల పత్రంలో భగీరథపురంలో స్టాక్ పాయింట్ అని మాత్రమే చెప్పారని.. ఇసుక తవ్వకాలు ఎక్కడ చేయాలో చెప్పలేదన్నారు. గొట్టా బ్యారేజీని ప్రమాదంలో నెట్టేసేలా ఇసుక తవ్వకాలకు అనుమతులివ్వడం దారుణమన్నారు.జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలకు విరుద్ధంగా వర్షాకాలంలో తవ్వకాలకు ఎలా అనుమతులిచ్చారో తెలియడం లేదన్నారు. పేరుకే సియాన్ గ్రూప్ అని.. అంతా నడిపిస్తోంది స్థానిక ఎమ్మెల్యేనని ఆరోపించారు. అవినీతితో పాతపట్నం నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు.

క్లుప్తంగా

ఓటమి భయంతోనే రమేష్ యాదవ్‌పై దాడి



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఎం చంద్రబాబుకు బీసీలంటే ఎప్పుడూ చులకన భావమేనని, పులివెందులలోని నల్లగుండవారిపల్లెలో ఎమ్మెల్సీ, బీసీ నేత రమేష్‌యాదవ్‌పై టీడీపీకి చెందినవారు దాడిచేసి కారు అద్దాలు బద్దలు కొట్టడం దారుణమని ఆలిండియా బీసీ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, వైఎస్సార్‌సీపీ కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు (రామారావు) తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నేతలతో పోటీపడలేక దాడులు చేసి గెలవాలని చూస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి పరిణామాలు చెల్లవన్నారు. దమ్ముంటే ప్రజాధారణతో గెలవాలని, దాడులు, దౌర్జన్యాలు చేసి భయపెట్టాలని చూస్తే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. చంద్రబాబు చరిత్ర అంతా బీసీలను చిన్నచూపు చూడడమేనని పేర్కొన్నారు. విశాఖలో మత్స్యకారులకి తోలు తీస్తాననడం.. నాయీ బ్రాహ్మణులకు తోకలు కత్తిరిస్తాననడం వంటి మాటలు బీసీలు ఇంకా మరిచిపోలేదని, అధికార దురహంకారంతో బీసీలని తొక్కేయాలని చూస్తే సహించేది లేదన్నారు.

భౌతిక దాడులతో గెలవలేరు



కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ క్యాడర్‌పై టీడీపీ మూకల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కళింగ వైశ్య కుల అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు అన్నారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రాముపై దాడి చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడుల సంస్కృతి అత్యంత హేయమైన చర్య అన్నారు. భౌతిక దాడులతో ఎన్నికల్లో గెలవలేరని, తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారన్నారు. జరిగిన ఘటనపై ఈసీ వెంటనే స్పందించి, దాడిచేసిన టీడీపీ గూండాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉప ఎన్నికలో ఎదుర్కోలేకే దాడులు



పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో టీడీపీ మూకలు రెచ్చిపోతూ చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ స్వరూప్ అన్నారు. ఉప ఎన్నికల్లో ఎదుర్కొనే దమ్ములేకే ఇటువంటి దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే పరిస్థితి కొనసాగితే తగిన మూల్యం నుంచి చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ అయిపోయిందని, రాక్షస పాలన సాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి గాలికొదిలేశారని దుయ్యబట్టారు.

అథ్లెటిక్స్ పోటీలకు 11 మంది విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

ఇచ్ఛాపురం: ఈనెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కనుపూర్ అక్షర సీబీఎస్ఈ పాఠశాలలో జరగనున్న సీబీఎస్ఈ క్లస్టర్ 7 అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక జ్ఞానభారతి నుంచి 11 మంది విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తున్నారని పాఠశాల కార్యనిర్వాహణ అధికారి జోహార్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు వీరికి పాఠశాల ఆవరణలో బుధవారం అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబీ పండా, హెచ్‌ఎం రషీదా సుల్తానా, వ్యాయామ ఉపాధ్యాయులు కై లాస్‌పండా, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న వేణుగోపాల్ తదితరులు

జి.సిగడాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ టి.వేణుగోపాల్, జి.సిగడాం సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ వి.రవికుమార్ బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు భోజనం పథకం కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యాన్ని తనిఖీ చేశారు. బియ్యంలో ఎక్కడైనా తెల్ల పురుగులు ఉంటే తక్షణమే సంబంధిత గోదాంకు తరలించాలన్నారు. ప్రతీరోజూ మోనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. వీరితో పాటు హెచ్‌ఎం ఎంవీఎస్ నర్సింహంమూర్తి, ఉపాధ్యాయులు బాలి అప్పలరాజు, ఎలకల ఆదినారాయణ, బాణాన లక్ష్మణరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో... సాంకేతిక పథం..!

- ఈనెల 8వ తేదీ నుంచి కొత్తయాప్
- ఇకపై ముఖ ఆధారిత హాజరు
- రోజుకు రెండు పర్యాయాలు ఫొటోలు తీయాల్సిందే



హిరమండలంలో ఉపాధి పనులు చేపడుతున్న వేతనదారులు(ఫైల్)

హిరమండలం: ఎన్ఆర్‌ఈజీఎస్‌లో ఈనెల 8వ తేదీ నుంచి హాజరు నమోదుకు సరికొత్త ఆలోచనను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. దీనిలో భాగంగా ఒక కొత్త యాప్‌ను తీసుకొచ్చారు. ఈ యాప్‌లో జాబ్ కార్డు ఉన్నటువంటి ప్రతి ఒక్కరి ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో సదరు ఉపాధి వేతనదారు పనికి వచ్చిన అనంతరం అతని ఫొటో(ఐరిష్) తీస్తారు. ఒకవేళ యాప్‌లో నమోదు చేసిన వ్యక్తి ఫొటోకు మ్యాచ్ అవ్వకుంటే నగదు చెల్లింపులు చేసేందుకు వీలుండదు. ఈ యాప్‌ను శుక్రవారం నుంచి క్షేత్రస్థాయిలో ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో మండల స్థాయిలో ఉండే ఉపాధి అధికారులు తమ పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లుకు శిక్షణ ఇస్తున్నారు. అలాగే ఉపాధి ఏపీవోలు పని జరిగే ప్రాంతాల్లో కూలీలకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

అత్యాధునిక సాంకేతికతతో....

కొత్త మస్టర్ విధానంలో అత్యాధునిక సాంకేతికతను తీసుకొచ్చి గ్రామ, మండల, జిల్లాలోని భౌగోళిక పరిస్థితిని అంచనా వేసేలా యాప్ రూపొందించారు. దీనిలో ఇప్పటికే నమోదైన కూలీల వివరాలు, జాబ్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, కూలీల తాజా ఫొటోతో ఈకేవైసీ చేయించాలి. రెండు పర్యాయాలు ఫొటో తీసే సమయంలో వీటిలో ఏ ఒక్కటి సరిపోకపోయినా నమోదు కాదు. యాప్‌లో ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లో గతంలో జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఉపాధి ఏపీవోలు రోజుకు రెండు గ్రామాలకు సంబంధించిన పనుల ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో అటు ఉపాధి సిబ్బందికి, ఇటు కూటమి నాయకుల జేబులు నింపుకునే విధానానికి పెద్ద గండి పడినట్లు అవుతుంది.

హాజరు ఇలా..

ముఖ ఆధారిత హాజరు తీసుకునే విధానంలో కొత్త పద్ధతులను అవలంబించేలా మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లును తొలగించి, తమవారిని నియమించుకున్న కూటమి నాయకులకు ఈ కొత్త పద్ధతి అమల్లోకి వచ్చిన తర్వాత గొంతులో వెలక్కాయ పడిన పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ ఆధారిత హాజరు విధానంలో భాగంగా కూలీల ఫొటోలను సెల్‌ఫోన్‌లో తీసుకుని జాతీయ మొబైల్ పర్యవేక్షణ వ్యవస్థకు (ఎన్‌ఎంఎంఎస్)కు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. పని ప్రదేశంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేసే కూలీల ఫొటోలను తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ సమయంలో ఒకరు తరుపున మరొకరు హాజరైనట్లు చూపితే ఆన్‌లైన్‌లో హాజరు తీసుకోదు.



కొత్త యాప్‌పై శిక్షణ ఇస్తున్న అధికారులు

4 గంటల తర్వాతే ఫొటో అప్‌లోడ్

పని ప్రదేశంలో మొదటి ఫొటోను ఉదయం 6 గంటలకు తీసి అప్‌లోడ్ చేస్తే, అనంతరం 4 గంటల తర్వాత అనగా ఉదయం 10 గంటలకు ఫోన్‌లో మరోసారి ఫొటో అప్‌లోడ్ చేయాలని సిగ్నల్ వస్తుంది. ఆ తర్వాత ఫొటో అప్‌లోడ్ చేయకపోతే ఆరోజు కూలీలకు నగదు చెల్లింపులు ఉండవు. ఇలా చేయడం వలన ఇదివరకు మస్టర్ల మాయాజాలం చేసేవారికి ఇబ్బందులు తప్పవు. కాగా అదే సమయంలో ఉపాధి వేతనదారులకు ప్రస్తుతం ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. మూడు నెలలుగా వేతనదారులకు నగదు చెల్లింపులు చేయలేదు. కేంద్ర ప్రభుత్వం నగదును విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని పక్కదారి పట్టించింది. అయితే రెండు రోజుల్లో కొత్త విధానం ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో తమకు రావాల్సిన మూడు నెలలు వేతనాల పరిస్థితి ఏంటిని ప్రశ్నిస్తున్నారు.

అవకతవకలకు చెక్



ఉపాధి పనుల్లో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యాప్‌ను ఈనెల 8వ తేదీ నుంచి అమలు చేయనున్నాం. దీంతో ఉపాధి పని జరిగేచోట ఎలాంటి అవకతవకలకు అవకాశం ఉండదు. అలాగే వేతనదారులు కూడా ఒకరి బదులుగా మరొకరు పనిచేస్తున్నారనే విమర్శలకు చెక్ పడుతుంది. పని జరిగేచోట నాలుగు దిక్కుల్లో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వేతనదారులకు నగదు చెల్లింపులు త్వరగా చేపడతాం.

– ఎ.శ్రీనివాసరావు, ఏపీవో, హిరమండలం

మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న పేరాడ తిలక్

- టీడీపీ కార్యకర్తలు ఎరువుల దోపిడీ చేశారు
- రైతులకు ఎరువులు ఇవ్వకపోతే ధర్నా చేస్తాం
- ధ్వజమెత్తిన పేరాడ తిలక్

టెక్కలి: జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల ప్రకటన చేయడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. టెక్కలిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎంతమంది రైతులకు యూరియా, డీఏపీతో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువుల అవసరమో కనీసం మంత్రికి అవగాహన లేకపోవడంతో, ఇప్పుడు ఎరువుల కొరత ఏర్పడిందన్నారు. నివేదిక అందజేయాల్సిన అధికారులు సైతం మంత్రి భజన చేసుకున్నారు తప్ప, క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన ఎరువులపై దృష్టి సారించలేదని మండిపడ్డారు. సహకార సొసైటీల ముసుగులో గ్రామాల్లో అధికార పార్టీ కార్యకర్తలు విచ్చలవిడిగా ఎరువుల దోపిడీ చేసుకున్నారని దుయ్యబట్టారు. టెక్కలి నియోజకవర్గంలో అధికార పార్టీ కార్యకర్తలు మీతిమీరిన ఎరువుల దోపిడీ చేశారని ఆరోపించారు.

నామమాత్రంగానే తనిఖీలు

రైతులు ప్రైవేట్ డీలర్ల వద్దకు వెళ్తే అక్కడ యూరియా, డీఏపీ కావాలంటే అదనంగా మరికొన్ని కలుపు మందులు, గుళికలు కొనాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారని, దీనిపై అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారని తిలక్ మండిపడ్డారు. మరోవైపు శివారు ప్రాంతాలకు సాగునీరు అందేవిధంగా ఎక్కడా మదుములు, చప్టాలు, షట్టర్లు బాగు చేయలేదన్నారు. వర్షాలు పడే మునుపు అరకొరగా బిల్లుల కోసం పనులు చేసుకున్నారని ఆరోపించారు. రైతులకు ఎంతో ఉపయోగకరమైన రైతు భరోసా కేంద్రాలను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే 15 రోజుల్లోగా రైతులకు అవసరమైన ఎరువులు, సాగునీరు అందజేయకపోతే చేతకాని మంత్రినని అచ్చెన్నాయుడు ప్రకటన చేసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే అధికారులు స్పందించకపోతే టెక్కలి వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు కె.అజయ్ కుమార్, వి.శ్రీధర్‌రెడ్డి, పి.రమణబాబు, పి.వైకుంఠరావు, డి.ధర్మారావు, పి.బాలకృష్ణ, ఎస్.వినోద్, బి.కార్తీక్, ఎస్.జగదీష్, జి.శ్యామలరావు, డి.శ్రీను, పి.శివ, పి.రాము, ఎస్.బాలకృష్ణ, కె.కనకరాజు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయతకు రాఖీ



మార్కెట్‌లో రాఖీల అమ్మకం



వివిధ రకాల రాఖీలు



సోదరుల పేర్లతో ఉన్న రాఖీలు



సిద్ధంగా ఉన్న వెండి రాఖీలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రావణ మాసంలో జరుపుకునే రాఖీ పండగ ఎంతో ప్రత్యేకమైనది. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఈ పండగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకుంటారు. ఆచార వ్యవహారాల్లో మిగిలిన పండగలకు తేడా లున్నా, దేశమంతా ఒకేరోజు, ఒకేవిధంగా జరుపుకునే ఏకైక పండగ రాఖీ పండగ. ఆడపడుచులంతా తమ సోదరులకు హారతి ఇచ్చి సర్వకాల సర్వావస్థల్లో రక్షగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తూ రాఖీలను కడతారు. తర్వాత పిండి వంటలతో సోదరుడికి భోజనం పెడతారు. ఇక రాఖీ కట్టిన సోదరుడు తన తాహతుకు తగ్గట్టుగా కానుకలిస్తారు. ఆడపడుచులు తమ తోబుట్టిన వారితో కలసి ప్రేమానురాగాలు పంచుకుంటారు.

ట్రెండీ రాఖీల సందడి

ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ఆన్‌లైన్‌లో రాఖీల అమ్మకాలు జోరందుకున్నాయి. కొత్తదనం కోరుకునేవారికి ఈ రాఖీలు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. రాఖీల మీద సోదరుడి పేరు, ఫొటోలతో రాఖీలు తయారు చేస్తున్నారు. అలాగే రుద్రాక్షలు, వివిధ రకాల విత్తనాలు, దేవుడి బొమ్మలు, బ్రేస్‌లెట్ రాఖీలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. అలాగే రాఖీ పురస్కరించుకొని వీధుల్లోనూ దుకాణాలు విరివిగా వెలశాయి. మార్కెట్లో ఎన్నో రకాల ప్లాస్టిక్ పూలతో అందంగా, ఆకర్షణీయంగా తయారు చేసిన రాఖీలను అమ్ముతున్నారు. రూ.25 నుంచి రూ.1000ల వరకు ధరలు కలిగినవి మార్కెట్లో అమ్మకానికి ఉన్నాయి.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ



సెల్‌ఫోన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పలాస: కాశీబుగ్గ కేటీ రోడ్డు బాలాజీ సెల్‌ఫోన్ దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుకాణంలో ఉన్న రూ.1.20 లక్షల నగదును అపహరించారు. కాశీబుగ్గ పోలీసులు, బాధితుల కథనం మేరకు.. పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన నిమ్మన షణ్ముఖరావు కాశీబుగ్గ రోడ్డులో బాలాజీ సెల్‌ఫోన్ సర్వీసింగ్ సెంటర్ గత 15 ఏళ్లుగా నడిపిస్తున్నాడు. గత రెండు నెలలుగా సెల్‌ఫోన్ సర్వీసింగ్ దుకాణం ముందు తాత్కాలిక టిఫిన్ దుకాణం కూడా పెట్టారు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం 6 గంటల సమయంలో టిఫిన్ దుకాణం తెరిచేందుకు షణ్ముఖరావుతో పాటు వాళ్ల అన్నయ్య యువరాజ్ రాగా సెల్‌ఫోన్ దుకాణానికి వేసిన తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. దీంతో లోపలికి వెళ్లి చూడగా సర్వీసింగ్ దుకాణంలో ఉన్న రూ.1.20 లక్షలు చోరీ జరిగినట్లు గుర్తించి కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, శ్రీకాకుళం క్లూస్ టీం వెళ్లి వేలిముద్రలను సేకరించారు. అలాగే పలాసలో నివాసం ఉంటున్న జినగ గోపాల్‌కు సంబంధించిన టైలరింగ్ దుకాణంలో కూడా చోరీ జరిగింది. మూడు జతల దుస్తుల దొంగతనం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. అక్కడ కూడా క్లూస్ టీం వేలుముద్రలను సేకరించారు. వీటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ చెప్పారు.

భారీగా గంజాయి స్వాధీనం

- ముగ్గురు యువకులు, ఒక మైనర్ బాలుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

ఆమదాలవలస: పట్టణ పరిసర ప్రాంతాల్లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు సీఐ పి.సత్యనారాయణ తెలియజేశారు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఆమదాలవలస ఎస్ఐ ఎస్.బాలరాజుకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు పురపాలక సంఘం పరిధిలోని 18వ వార్డు కంచ్రపేట వద్దనున్న శ్మశానవాటిక వద్ద దాడులు చేపట్టామన్నారు. ఈ దాడుల్లో గంజాయితో ఇద్దరు యువకులు, ఒక మైనర్ బాలుడు పట్టుబడ్డారని పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి 21.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పట్టుబడినవారిలో పట్టణంలోని కొత్త కంచ్రపేటకు చెందిన కారుణ్య జగదీష్, ఐదో వార్డు సొట్టవానిపేట టీజీఆర్ నగర్ కాలనీకి చెందిన సయ్యద్ తహీర్ బాబుతో పాటు ఒక మైనర్ బాలుడు ఉన్నారన్నారు.

ఒడిశాలో కొనుగోలు చేసి...

వీరంతా ఒడిశా రాష్ట్రంలో బరంపురం సమీపంలోని కళ్లికోట్‌కు చెందిన నీలాంచల్ పట్నాయక్ వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు తెలుపడంతో వీరితో పాటు ఆయనను కూడా అరెస్టు చేశారు. వీరు కొనుగోలు చేసిన గంజాయిని రైలు మార్గం ద్వారా ఆమదాలవలసకు తరలిస్తూ, కొంతమొత్తం వీరు సేవిస్తూ మరికొంత విక్రయిస్తూ ఉండేవారని పేర్కొన్నారు. నిందితుడు కారుణ్య జగదీష్‌పై ఇప్పటికే 9 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. 2024లో గంజాయి కేసు నమోదు అయ్యిందని ఇతనిపై స్టేషన్‌లో హిస్టరీ సీట్ కూడా ఉన్నట్లు తెలిపారు. అలాగే సయ్యద్ తాహిర్‌పై రెండు దొంగతనాలు కేసులు నమోదై ఉన్నాయన్నారు. మైనర్ వ్యక్తిపై మూడు సార్లు దొంగతనం కేసులు నమోదు అయ్యాయని, ఇతను ఇదివరకే అబ్జర్వేషన్ హోమ్‌కు వెళ్లి బయటకు వచ్చినట్లు చెప్పారు. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులపై మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులు నలుగురిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు వెల్లడించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఒక బంగారు దుకాణంలో పనిచేస్తున్న యువకుడు కడుపునొప్పి తాళలేక విషంతాగి చికిత్స పొందుతూ మృతి చెందాడని రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు బుధవారం తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. సంతకవిటి మండలం జీఎంపురం గ్రామానికి చెందిన గురుగుబెల్లి పృథ్వీరాజ్ (25) నగరంలోనే అద్దె ఇంట్లో ఉంటూ షాపులో పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా తీవ్రంగా కడుపు నొప్పి వేధిస్తుండడంతో రెండు రోజుల క్రితం విషం తాగాడు. విషయం తెలిసిన బంధువులు ముందుగా రిమ్స్‌లో చేర్చారు.. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బుధవారం మృతి చెందడంతో మృతుని మేనమామ టి.జగన్నాథరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

నరసన్నపేట: జాతీయ రహదారిపై మండలంలోని తామరాపల్లి సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం పట్టణంలోని ఆదివారంపేటకు చెందిన దమ్ము నూకాలమ్మ(62) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతురాలు నూకాలమ్మ తన కుమారుడు సుధాకర్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై కోటబొమ్మాళి మండలం కొత్తపల్లిలో ఒక శుభ కార్యక్రమానికి వెళ్లింది. తిరిగి స్వగ్రామం ఆదివారంపేటకు వెళ్తుండగా తామరాపల్లి వద్ద ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని పశ్చిమ బెంగాల్ నుంచి వస్తున్న స్పోర్ట్ బైక్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక ఉన్న నూకాలమ్మ తీవ్రగాయాలకు గురవ్వడంతో 108లో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 9 గంటల సమయంలో ఆమె మృతి చెందారని ఏఎస్ఐ అశిరినాయుడు తెలిపారు. కాగా ఈ ప్రమాదంలో సుధాకర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదంపై నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులోకి వ్యాక్సిన్లు



చిన్నారులకు వ్యాక్సిన్లు వేస్తున్న సిబ్బంది

టెక్కలి రూరల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ టెక్కలి జిల్లా ఆస్పత్రిలో గత కొద్ది రోజులుగా చిన్నపిల్లలకు వేసే వ్యాక్సిన్లు అందుబాటులో లేకపోవడంతో పలుమార్లు సాక్షిలో వెలువడిన కథనాలకు జిల్లా వైద్యాధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం పూర్తిస్థాయిలో వ్యాక్సిన్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో కె.కొత్తూరు పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది అధ్వర్యంలో ఐపీవీ, డీపీటీ, ఎంఆర్, రోటా, ఓపీవీ ఇతర వ్యాక్సిన్లు చిన్నారులకు వేశారు.

హోంగార్డుకు ఆర్థికసాయం

శ్రీకాకుళం క్రైమ్ :

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు బి.సూర్యనారాయణకు జిల్లా హోంగార్డులు ఒక్కరోజు వేతనం రూ.4.08 లక్షలను ఆర్థిక సాయంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి చేతుల మీదుగా బుధవారం అందజేశారు.



చెక్ అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

'ఫ్రాంక్లిన్ టెక్'తో మహిళా కళాశాల ఎంఓయూ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ (అటామస్) కళాశాల 'ఫ్రాంక్లిన్ టెక్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్'తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులతో నిర్వహించిన కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సులో ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆర్.శివకుమార్ మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్, సాఫ్ట్‌వేర్ ప్రాజెక్ట్స్, కార్పొరేట్ ట్రైనింగ్స్, కన్సల్టింగ్ సర్వీసెస్, ఇండస్ట్రీ కొలాబరేషన్, జాబ్ ప్లేస్‌మెంట్స్ తదితర అంశాలపై సుదీర్ఘంగా వివరించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా పేదలకు, అనాథలకు సేవ చేయాలని ఉందని చెబుతూ.. బీఏ హిస్టరీ విద్యార్థిని నందినికి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చిన్నారావు, అకడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.మౌనిక, తెలుగు విభాగాధిపతి డాక్టర్ కె.జ్యోతిలక్ష్మి, జేకేసీ కో–ఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎంఓయూ పత్రాలతో సీఈఓ, ప్రిన్సిపాల్

ఆర్టీసీకి ఆదరణ లభించేలా చూడాలి



అద్దె బస్సుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్టీసీ మేనేజర్లు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీకు ప్రజల్లో మంచి ఆదరణ లభించేలా చూడాల్సిన బాధ్యత అద్దె బస్సుల యాజమాన్యాలపై కూడా ఉందని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, శ్రీకాకుళం రెండు, టెక్కలి డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మ, శ్రీనివాసరావులు కోరారు. శ్రీకాకుళంలోని జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో బుధవారం జిల్లాలోని అద్దె బస్సుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో తిరుగుతున్న అద్దె బస్‌లన్నీ మంచి కండీషన్‌లో ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. ప్రయాణికులు చేయి ఎత్తిన చోట బస్సులు ఆపి అందరినీ జాగ్రత్తగా ఎక్కించుకోవాలని సూచించారు. బస్సు ఎక్కిన ప్రతీ ప్రయాణికుడితో సిబ్బంది స్నేహపూర్వకంగా మసలుకోవాలన్నారు. సమావేశంలో అద్దె బస్సుల యాజమాన్యాలు పాల్గొన్నాయి.

ప్రైవేట్ టీచర్లకూ అవార్డులు ఇవ్వాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే ఉత్తమ ఉపాధ్యాయ, అధ్యాపక అవార్డులను ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్నవారికి సైతం అందజేయాలని ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ జి.మన్మథరావు, జిల్లా అధ్యక్షుడు నాగశివ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావులు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యతలో వంద శాతం సాధించడానికి ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ పాత్ర ఎంతో కీలకమనే విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న స్టూడెంట్స్ కంటే.. ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న స్టూడెంట్స్ ఎంతో అధికమన్నారు. తమను కూడా ప్రభుత్వాలు ఇచ్చే అవార్డుల్లో చేర్చేలా చూడాలని కోరారు.